క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహన



ఆర్టీసీ డిపోలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పార్వతీపురం రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆర్టీసీ డిపోలో పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపోలో గ్యారేజీలో డీజిల్, పెట్రోల్ ఇతర లూబ్రికేషన్ ఆయిల్స్ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైతే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రయాణికులకు అవగాహనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి అగ్నిప్రమాదాలు, నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గ, కేంద్ర అగ్నిమాపక అధికారి జి.ప్రభాకరరావు, రవాణా–అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

తొక్కుడువలసలో బోరు నిర్మాణం



గ్రామంలో జరుగుతున్న బోరు నిర్మాణం

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురం పంచాయతీ తొక్కుడువలస గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఏర్పడగా సీపీఎం నాయకులు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో గ్రామస్తుల ద్వారా తాగునీటి సమస్య వివరించగా సంబంధిత అధికారులు మంగళవారం గ్రామంలో బోరు నిర్మాణం ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి స్పందించిన కలెక్టర్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు పి. రాము మాట్లాడుతూ మండలంలో నేటికీ మౌలిక సదుపాయాలకు కనీస స్థాయిలో నోచుకోని గిరిజన గ్రామాలు ఉన్నాయని సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.రాము, కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వాహనాలు



జాతీయరహదారిపై అడ్డుగా పడిపోయిన చెట్టు

సాలూరు: సాలూరు పట్టణం నుంచి జీగిరాం మీదుగా గల పాచిపెంట ఎన్‌హెచ్26 జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులకు శ్యామల గౌరీపురం, జీగిరాంల మధ్య గల పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జేసీబీ సాయంతో చెట్టును తొలగించిన తరువాత ట్రాఫిక్ క్లియరైంది.

ఏపీ రాష్ట్ర బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య కార్యదర్శిగా ప్రమాణం



రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణం చేస్తున్న గన్నవరపు శ్రీనివాస్

సీతానగరం: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ప్రమాణ స్వీకారం ఏలూరు పట్టణంలో మంగళవారం జరిగింది. ప్రమాణస్వీకారోత్సవానికి ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సతీష్ శర్మ, కార్యదర్శి మనోహర్, అడ్వయిజరీ కమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాస్‌ల సమక్షంలో సీతానగరం మండలకేంద్రానికి చెందిన గన్నవరపు శ్రీనివాస్ కార్యదర్శిగా ప్రమాణం చేశారు. ఈ మేరకు ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా సమాఖ్య సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారావు

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న కృష్ణారావును సీఎంఓలో డిప్యుటేషన్‌పై నియమించారు.తాజాగా ఆయన సాలూరు మున్సిపల్ రెగ్యులర్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం మున్సిపల్ డీఈ ప్రసాద్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

- మురుగునీటితో పేరుకుపోతున్న కాలువలు
- విజృంభిస్తున్న దోమలు
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం

ప్రమాదం అంచున ప్రజారోగ్యం



తుమరాడలో మురుగునీటితో పేరుకుపోయిన కాలువ

బలిజిపేట:

గ్రామాల్లో ఉండాలన్నా, అడుగుపెట్టాలన్నా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రజారోగ్యం ప్రమాదకరంగా కనిపిస్తోంది. వీధులు దుర్గంధభరితంగా ఉన్నాయని, వీధుల్లోకి రాలేకపోతున్నామని, వీధి కాలువల పక్కన నివాస గృహాల్లో నివసించలేకపోతున్నామని, అంటు రోగాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఆర్భాటం చేయడమే తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. బేనర్లు పట్టి ఏదో మొక్కుబడిగా ర్యాలీచేసి, ఫొటోలకు ఫొజులిచ్చి అక్కడితో మమ అనిపించేస్తున్నారు తప్ప పారిశుధ్య పనులపై దృష్టిసారించి వీధులు, కాలువలను పరిశుభ్రం చేయించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేర లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా కనిపించడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు చెత్తచెదారాలతో పేరుకుపోయి రోడ్లపైనే మురుగునీరు నిల్వతో పల్లె వీధులు అపరిశుభ్ర వాతావరణంలో తాండవిస్తున్నాయి. పారిశుధ్య పనులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు దుర్వాసనతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. వీధికాలువలు మురుగునీటితో నిండిపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారుతున్నాయనేది నగ్నసత్యం.



నారాయణపురంలో దుర్గంధభరితంగా ఉన్న కాలువ

అది పంచాయతీల బాధ్యత

గ్రామాల్లో పారిశుధ్య పనులు, విద్యుత్ దీపాల నిర్వహణ పంచాయతీలదే బాధ్యత. సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిశుభ్రం చేయాలని సూచిస్తున్నాం. వారిచేత చేయిస్తున్నాం.

– పుష్పారావు, ఈఓపీఆర్‌డీ, బలిజిపేట

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కన, వీధికాలువల్లోనే

వ్యర్థాలన్నీ గ్రామాల్లోని వీధులు, కాలువల్లో కనిపిస్తున్నాయి. కాలువల్లో పూడికతీత సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు పేరుకుపోతోంది. వీధి కాలువల నిర్మాణాలు సక్రమంగా లేకపోవడంతో నీరుపారేందుకు అవకాశాలు లేకుండా పోయాయి. వ్యర్థాలను రోడ్డు పక్కన పడవేయడంతో అవి చెల్లాచెదురై కాలువల్లోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. పంచాయతీల పాలకులు రాజకీయ మొహమాటాలకు పోయి గ్రామాలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి

- డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి



మండలస్థాయి అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి

పార్వతీపురం రూరల్: మండలంలోని సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి కోరారు. ఈ మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ మేరకు వివిధ శాఖల ప్రగతిపై అధికారులను ఆరాతీశారు. అలాగే వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు కార్యాచరణపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం గృహ నిర్మాణాలు, ఉపాధిహామీ పనులు, ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న నిర్మాణాల ప్రగతి వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు కనిపించవా?

- కాంగ్రెస్ నాయకుల పరిశీలన



రోడ్డుపై గుంతలు చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న రోడ్లు గోతులు, రాళ్లు తేలి అధ్వానంగా ఉండడంతో సంబంధిత అధికారులకు కానీ, ప్రజాప్రతినిధులకు కానీ కనిపించడం లేదా? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వెంకంపేట, పులిగుమ్మి, అడ్డాపుశీల తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఓబీసీ సెల్ నాయకుడు వి. దాలినాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం వెళ్లే రహదారిలో గోతులను, రాష్ట్రీయ రహదారిపై ఉన్న గోడ వంటి, రోడ్లపై ప్రమాదాలు పొంచి ఉన్న పరిస్థితులు పాలకులకు ఎందుకు పట్టడం లేదని విస్మయం చెందారు. ఎన్నికల సమయంలో రోడ్లు చూపించి ఎన్నికల హామీగా చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎందుకు రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇదే రహదారిలో నిత్యం కూటమి నాయకులు, కార్యకర్తలు, జిల్లా ఉన్నతాధికారులు సహా రాకపోకలు సాగిస్తున్న తరుణంలో రోడ్డుపై ఉన్న గుంతలు, స్థానిక వైకేఎం వద్ద రోడ్డుపై ఉన్న గోడ కన్పించకపోవడం హాస్యాస్పదమన్నారు. సంక్రాంతికి రోడ్లపై గోతులు లేకుండా చేస్తామని ప్రకటించిన కూటమి పాలకులు ఉగాది అయినప్పటికీ ఆ ప్రకటనలకు స్పందన కరువైందన్నారు. ఈ పరిశీలనలో గేదెల రామకృష్ణ, తీళ్ల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి ఒప్పంద జీఓలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆశవర్కర్స్ సీహెచ్‌డబ్ల్యూ యూనియన్ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి

- ఏపీ ఆశవర్కర్స్, సీహెచ్‌డబ్ల్యూ యూనియన్

పార్వతీపురం: ఆశవర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలకు వేతనాలు పెంచి ఒప్పంద జీఓలను అమలు చేయాలని ఏపీ ఆశవర్కర్స్ సీహెచ్‌డబ్ల్యూ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని లూథరన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆశవర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఏర్పడి 20 సంవత్సరాలు నేటికీ పూర్తి కావడంతో అనేక సమస్యలను పోరాటం ద్వారా పరిష్కరించామన్నారు. ఒకప్పుడు ఆశ కార్యకర్తలకు పనికి తగిన పారితోషికం రూ.10వేలు గౌరవ వేతనం సాధించి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.400 నుంచి రూ. 4వేల వరకు వేతనం సాధించినట్లు పేర్కొన్నారు. ఆశలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీసస్థాయిలో వేతనాలు అమలు కావడం లేదన్నారు. రూ.26వేలు కనీసం వేతనం ఇవ్వాలని గుర్తింపుకార్డులు, ఈఎస్‌ఐ పీఎఫ్ వంటి ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించి, సెలవులు, సాధారణ సెలవులు, మెడికల్ సెలవులు ఇవ్వాలని ఆశలకు, సీహెచ్ డబ్ల్యూల సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరాటం చేస్తామన్నారు. ఆ పోరాటంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాని, డి.రమణారావు, వై.మన్మథరావు, లక్ష్మి గంగాభవాని, రాజేశ్వరి, మాలతి, సీఐటీయూ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

పార్వతీపురంటౌన్:



ఎస్.వెంకటేశ్వరరావు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి సాధికారత అధికారి ఎస్.వెంకటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ ఆటల విభాగానికి సంబంధించి శిక్షకులు, క్రీడాంశాలు, వేదికలకు సంబంధించి ప్రతిపాదనలు శాప్ ఆమోదానికి పంపించామని పేర్కొన్నారు.

17న క్రీడా సంఘాలతో సమావేశం

క్రీడాశిక్షణకు సంబంధించి ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా క్రీడల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతిపాదనలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం



చక్రస్నానానికి సిద్ధం చేసిన అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం:

మండలకేంద్రంలో సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరిగిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ నిర్వాహకులు చెలికాని రాజశేఖర్, వెంకట గోపాలకృష్ణల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారిని ఆలయప్రాంగణం నుంచి ఊరేగింపుగా సువర్ణముఖి నదిలో స్వామివారికి చక్రస్నానం చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బూర్జలో నూతన గ్రావెల్ రోడ్డు నిర్మాణం



ప్రారంభించిన గ్రావెల్ రోడ్డు పనులు

సీతానగరం: మండలంలో నూతనంగా రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్ జి.దాసు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ బూర్జ గ్రామం నడివీధుల మీదుగా నిరంతరం పార్వతీపురం–పి.చాకరాపల్లి, బొబ్బిలి– పి.చాకరాపల్లికి బస్సుల రాకపోకలు జరుగుతున్న కారణంగా ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు పడుతుండగా వారి సౌలభ్యం కోసం గ్రామం శివారునుంచి నూతనంగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకుడు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థులపై ఉపాధ్యాయుడి దాడి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- ప్రిన్సిపాల్‌తో తల్లిదండ్రుల వాగ్వాదం

మక్కువ: మండలంలోని అనసభద్ర సమీపంలో గల ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థులపై ఉపాధ్యాయుడు కర్రతో దాడి చేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏకలవ్యపాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్త బట్టలు విద్యార్థులు దొంగిలించారన్న నెపంతో ఆదివారం రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12:30 వరకు పైశాచికంగా పలు ఆసనాలు వేయించి, కర్రతో దాడి చేసినట్లు విద్యార్థులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. కర్రతో కొట్టినట్లు మీ తల్లిదండ్రులకు తెలియజేస్తే టీసీ ఇచ్చి ఇంటికి పంపించేస్తామని పిల్లలను బెదిరించారన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సోమవారం సమావేశమై, మంగళవారం ప్రిన్సిపాల్‌ను కలిశామని తెలిపారు. విద్యార్థులను కర్రతోకొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రిన్సిపాల్‌ను అడగ్గా ఆయనకు ఈ విషయం తెలియదని చెప్పడం దారుణమన్నారు. అలాగే పాఠశాలలో భోజనం సక్రమంగా వండి, వడ్డించడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారన్నారు. విద్యార్థులపై దాడి పట్ల ఏఐఎస్ఎఫ్ నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా తరచూ ఆరోగ్యకార్యకర్త బట్టలను తీస్తుండడంతో విద్యార్థులను మందలించారే తప్ప ఉద్దేశపూర్వకంగా కొట్టలేదన్నారు. కొంతమంది విద్యార్థులు పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో గెడ్డకు వెళ్తుండడం, పాఠశాల గోడ దూకుడు వంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఈ విషయాలపై విద్యార్థులను మందలిస్తామే తప్ప, ఏ రకమైన దురుద్దేశం లేదన్నారు. ముందు ఇటువంటి సంఘటన జరగకుండా చూస్తామని చెప్పారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి ఐ.రాజేశ్వరి



కాశీపేట కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఐ.రాజేశ్వరి

సీతానగరం: హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి, అసంపూర్తిగా నిలిచిపోయిన పక్కా గృహాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారి ఐ.రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులతో మంగళవారం అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం అనంతరం కాశీపేట హౌసింగ్ కాలనీలో నిర్మాణ దశలోఉన్న ఇళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన పక్కాగృహాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు వినియోగించుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుదీకరణ, పారిశుధ్యం,సీసీ రోడ్లు, కాలువల సమస్యలను సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ శాఖాపరమైన సమస్యలను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు మాట్లాడుతూ కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సామాజిక పరమైన సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శిలు, ఇంజినీరింగ్ సహాయకులకు సూచనలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జానకీరాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



స్వాధీనం చేసుకున్న 350 సారాప్యాకెట్లతో ఎస్సై నాగేశ్వరరావు

పార్వతీపురంటౌన్: సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎక్సైజ్ ఎస్సై యు.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఇందిరాకాలనీలో తనిఖీలు నిర్వహించి సారా విక్రయిస్తున్న సిరిపురపు రాజేష్ నుంచి 350 సారా ప్యాకెట్‌లు పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఆర్కే బట్టివలసలో 220 లీటర్ల సారా స్వాధీనం

మండలంలోని ఆర్కే బట్టివలస గ్రామ సమీపంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి సిబ్బందితో దాడులు నిర్వహించి ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడు బంగారు వెంకటిని అరెస్టు చేశారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న శక్తి టీం ఏఎస్ఐ శ్రీనివాస్‌రావు

పార్వతీపురంటౌన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం ఏఎస్సై శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని బాలికల వసతి గృహ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ, విద్యార్థినిలు, బాలికలు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జజ్జనకర జనారే..!



డప్పులు కొడుతున్న చిన్నారులు



తుడుము కుండ కొడుతున్న బాలుడు

సాలూరు: ఏజెన్సీ ప్రాంతాల్లో ఇటుకల పండుగ హడావుడి నెలకొంది. కాగా గ్రామాల్లో పలువురు చిన్నారులు డప్పులు,తుడుము కుండలు కొడుతూ జజ్జనకరి జనారే అంటూ అబ్బురపరుస్తున్నారు. కనీసం డప్పు,తుడుముకుండ వంటి వాయిద్యాలంత పొడవుకూడా లేని వారు లయబద్ధంగా వాటిని వాయిస్తుండడం చూసి పలువురు అబ్బురపడుతున్నారు. తెలిసీతెలియని వయస్సులో వారు చూపిస్తున్న ఈ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంటోంది.